నేడు విశ్రాంత ఉద్యోగుల సమావేశం

గౌతంనగర్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం మల్కాజిగిరి శాఖ సర్వసభ్య సమావేశం నేరేడ్‌మెట్‌లోని డైట్ (జిల్లా విద్యా శిక్షణ సంస్థ) కళాశాలలో ఈనెల 30న (నేడు) నిర్వహించనున్నట్లు సంఘం కోశాధికారి గోపాల్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

అక్రమ కట్టడాలపై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు

మల్లాపూర్: నాచారం డివిజన్‌లోని అక్రమ కట్టడాలపై చర్యలు తీసు కోవాలని కోరుతూ నాచారం డివిజన్ చెందిన కాంగ్రెస్ నేతలు జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిల్‌కు శుక్రవారం ఫిర్యాదు చేశారు. మాజీ కౌన్సిలర్ కృష్ణారెడ్డి, మెతుకు శ్రీనివాస్, మహ్మద్ షాహిద్, తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్‌లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి కోరారు. ఈమేరకు సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మంగేష్ కుమార్, డివిజన్ అధ్యక్షుడు ఓం ప్రకాశ్, జ్యోతిర్మయి, గోపాల్, సాయి సురేశ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు



విద్యార్థులకు చెక్కులు అందజేస్తున్న దృశ్యం

రామంతాపూర్ : క్రమశిక్షణతోనే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు పేర్కొన్నారు. హరివరాసనం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎం.సంజనకు రూ. 5 వేలు, సి. సంజనకు రూ. 3 వేలు, అనితకు రూ. 3 వేల చెక్కులను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ శాంత ట్రస్టీ మహేందర్ ముదిరాజ్, బుర్ర నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి ప్రత్యేక వాటర్ పాండ్ ఏర్పాటు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ కొకూర్‌లో వినాయకుడి నిమజ్జనం కోసం ప్రత్యేక వాటర్ పాండ్‌ను ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తుడిమెల్ల మల్లికార్జున్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కృషితో వాటర్ పాండ్‌ను ఏర్పాటుచేశారన్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ రాజీజితేంద్రనాథ్, డీఈ మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కిరణ్, శివరాజ్, కిశోర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్‌కు స్కోప్ ఎమినెన్స్ అవార్డు



రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సీఎండీ అనురాగ్‌కుమార్

కుషాయిగూడ: నగరంలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) స్కోప్ ఎమినెన్స్ అవార్డును సొంతం చేసుకుంది. 2022–23 సంవత్సరానికి గాను ఇనిస్టిట్యూషనల్ ఎక్సలెన్స్ విభాగంలో అవార్డు సాధించగా న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో శుక్రవారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ అందుకున్నట్లు ఈసీఐఎల్ వర్గాలు తెలిపాయి. కార్పొరేట్ విధానాలు, ఆర్థిక నిర్వహణ, సామాజిక బాధ్యతతో పనితీరును ప్రదర్శించే కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను ఈ అవార్డుకు ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఈసీఐఎల్ టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ అనేష్ కుమార్ శర్మ కూడ పాలుపంచుకున్నట్లు పేర్కొన్నాయి.



కాప్రా చెరువు



నిమజ్జనానికి సిద్ధమైన కొలను



మల్కాజిగిరిలో ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన క్రేన్లు

గణనాథుల నిమజ్జనానికి సర్వం సిద్ధం..!

కాప్రా చెరువు వద్ద ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

అన్ని శాఖల అధికారుల సమన్వయంతో విధులు

కాప్రా: గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి కాప్రా చెరువు వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు నుంచే విగ్రహాలు నిమజ్జనం చేసేందుకు భక్తులు కాప్రా చెరువు వద్దకు చేరుకుంటున్నారు. దీంతో అధికారులు చిన్న చిన్న విగ్రహాల నుంచి భారీ విగ్రహాలను సైతం నిమజ్జనం చేసేలా చెరువు వద్ద క్రేన్లు సిద్ధంగా ఉంచారు. అంతేకాదు చెరువ, కొలనులో వేసిన విగ్రహాల వ్యర్థాలు, పూజాసామగ్రి ఎప్పటికప్పుడు తొలగించేందుకు కూడా జేసీబీలు, లారీలు అందుబాటులో ఉంచారు.

సమన్వయంగా విధులు

కాప్రా చెరువు వద్ద అన్నిశాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారు. జీహెచ్ఎంసీతో పాటు పోలీసు, ట్రాఫిక్, జలమండలి, ఇరిగేషన్, విద్యుత్, వైద్యాశాఖ అధికారులు చెరువు వద్ద ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశారు. ప్రతి శాఖకు చెందిన అధికారులు షిఫ్టల విధానంలో విధులకు హాజరవుతున్నారు. అన్ని శాఖల నుంచి కాప్రా చెరువు వద్ద దాదాపు 100 మంది విధుల్లో ఉంటున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. మరోవైపు నిమజ్జనానికి చెరువు వద్దకు చేరుకుంటున్న గణనాథులకు సాంప్రదాయంగా స్వాగతం పలికేందుకు భాగ్యనగర్ ఉత్సవ సమితి అధ్వర్యంలో స్వాగత తోరణం ఏర్పాటు చేశారు.

2 భారీ క్రేన్లు సిద్ధం..

ప్రస్తుతం చెరువు వద్ద 2 భారీ క్రేన్లు సిద్ధంగా ఉన్నాయి. నిమజ్జనాల సంఖ్యను బట్టి అవసరమైతే 5 భారీ క్రేన్లతో పాటు ముందు జాగ్రత్తగా ఇద్దరు గజ ఈతగాళ్లను సైతం అందుబాటులో ఉంచారు.



కాప్రా చెరువు వద్ద సిద్ధంగా భారీ క్రేన్లు

మల్కాజిగిరి సర్కిల్‌లో నిమజ్జనం షురూ

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో గణనాథుల నిమజ్జనం శుక్రవారం నుంచే ప్రారంభమైంది. దీంతో సఫిల్‌గూడ మినీ ట్యాంక్‌బండ్, బండచెరువు కొలను వద్ద అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్ వద్ద రెండు క్రేన్లు అందుబాటులో ఉంచారు. రాచకొండ కమిషనరేట్ నేరేడ్‌మెట్ పోలీసుల ఆధ్వర్యంలో బండ్ వద్ద కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో నిఘా ఉంచారు. నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశామని నోడల్ అధికారి ఈఈ లక్ష్మణ్ తెలిపారు. భక్తుల కోసం మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య శిబిరం, అత్యవసర పరిస్థితుల్లో తరలించేందుకు అంబులెన్స్, నిరంతర విద్యుత్ సరఫరా కోసం పవర్ జనరేటర్, మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు.



కాప్రా చెరువు వద్ద ఏర్పాటు చేసిన వివిధ శాఖల అధికారుల శిబిరాలు



మల్కాజిగిరి సఫిల్‌గూడలో నిమజ్జనఘాట్



మల్కాజిగిరిలో సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రమేశ్

యోగాలో విద్యార్థికి గోల్డ్ మెడల్

ఉప్పల్: యోగా పోటీల్లో ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థి వి . శ్రీకాంత్‌కు గోల్డ్ మెడల్ దక్కింది. దీంతో పాటు రెండు సిల్వర్ మెడల్స్ కూడా వచ్చాయని ప్రిన్సిపాల్. డా. విజయ్‌కుమార్ తెలిపారు. ఇటీవల బాలానగర్‌లో మేడ్చల్ జిల్లా లెవల్ యోగా పోటీలు నిర్వహించగా ఉప్పల్ డిగ్రీ కళాశాలలో బీఏ చదువుతున్న విద్యార్థి వత్యాల శ్రీకాంత్ ఆరిస్టిక్ సింగిల్ యోగాసనంలో గోల్డ్ మెడల్, ట్రెడిషనల్ యోగాసనం, ట్విస్టింగ్ బాడీ ఇండి విజువల్‌లో రెండు సిల్వర్ మెడల్స్‌ను సాధించినట్లు తెలిపారు.

అనుమతుల్లేకుండా డీజే పెడితే సీజ్



మాట్లాడుతున్న మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకట రమణ

ఉప్పల్: అనుమతుల్లేకుండా డీజే పెడితే సీజ్ చేస్తామని మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకట రమణ హెచ్చరించారు. ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో డివిజన్ పరిధిలోని డీజే , ప్యాడ్ బ్యాండ్ ఓనర్స్ ఆపరేటర్లతో శుక్రవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు శబ్ద కాలుష్యంపై పలు మార్గదర్శకాలు విడుదల చేసిందని నిబంధనలకు విరుద్ధంగా డీజేను ఆపరేట్ చేస్తే సీజ్ చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, ఇన్‌స్పెక్టర్లు భాస్కర్, గోవింద్ రెడ్డి, రఘువీర్, సత్యనారాయణ, బాల స్వామి రాజువర్మ పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం

గౌతంనగర్: డివిజన్‌కు చెందిన శ్రీనివాసాచారి రూ. లక్ష వ్యయంతో హనుమాన్‌పేట దుర్గా భవానీ ఆలయానికి ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆలయ ముఖద్వారాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలి

బోడుప్పల్: ఆరోగ్యవంతమైన జీవితం కోసం ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బోడుప్పల్ నగరపాలక సంస్థ పరిధిలో మహిత ఎన్‌జీఓ ఆధ్వర్యంలో లక్ష్మీనగర్ పార్కు, ద్వారకానగర్, శివ దుర్గ, చిన్న క్రాంతి కాలనీలోని పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను కమిషనర్ శైలజతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. నగర పాలక సంస్థలో మరిన్ని పార్కులు, జిమ్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు బొమ్మక్ కల్యాణ్ కుమార్, సుమన్‌నాయక్ , నేత శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఓపెన్ జిమ్ ప్రారంభిస్తున్న ఈటల రాజేందర్

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



తెలుగు భాషా దినోత్సవంలో డా. నాళేశ్వరం శంకరం, విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర రచయితల సంఘం అధ్యక్షుడు డా. నాళేశ్వరం శంకరం హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. దీంతో పాటు భాషా ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు తెలుగు తనం ఉట్టిపడేలా డ్రెస్‌లు ధరించి వచ్చారు. అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జాన్ కలరక్కల్, ప్రిన్సిపాల్ జయంతి రెడ్డి, తెలుగు విభాగం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన

అల్వాల్: అల్వాల్ కొత్త చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చర్లపల్లి చెరువు వద్ద

కుషాయిగూడ: చర్లపల్లి చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి శుక్రవారం పరిశీలించారు. భక్తులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని అధికారులకు సూచించారు.



చర్లపల్లి చెరువులో గణనాథుడిని నిమజ్జనం చేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి



మల్కాజిగిరిలోని వీణాపాణినగర్‌లో రాయల్‌బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడు

ప్రత్యేక పూజలు.. అన్నదానాలు

ఉప్పల్, మల్కాజిగిరి నియోజకవర్గాలో గణపతి నవరాత్రోత్సవాలు అంగరంగా వైభవంగా సాగుతున్నాయి. శుక్రవారం మండపాల వద్ద ప్రత్యేక పూజలు, మహిళలు సాముహిక కుంకుమార్చన నిర్వహించారు. అలాగే పలుచోట్ల అన్నదానాలు చేపట్టారు.

–ఉప్పల్,మల్కాజిగిరి జోన్ బృందం



హబ్సిగూడలో క్రాంతినగర్‌లోని రేఖ అపార్ట్‌మెంట్‌లో ..

ఉప్పల్‌లో విజృంభిస్తున్న చైన్ స్నాచర్లు

- వాకింగ్ చేస్తున్న మహిళను చెట్ల పొదల్లోకి లాక్కెళ్లి నిలువు దోపిడీ
- గొంతు నులిమి చంపుతానని బెదిరింపు



ప్రవీణ

ఉప్పల్: ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచర్లు రెచ్చిపోతున్నారు. గురువారం సాయంత్రం కళ్యాణపురిలో పని మనిషిపై దాడి చేసిన ఘటన మరువకముందే తెల్లారే సరికి వాకింగ్ చేస్తున్న మరో మహిళపై దాడి చేశారు. ఉప్పల్‌లో భగాయత్‌లో భర్తతో కలిసి వాకింగ్‌కు వచ్చిన మహిళను బలవంతంగా పొదల్లోకి లాక్కెళ్లి పుస్తెల తాడుతో పాటు చెవి కమ్మలు సైతం లాక్కెళ్లారు. పోలీసులు, బాధితురాలి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నాగోల్‌కు చెందిన ప్రవీణ శుక్రవారం ఉదయం భర్తతో కలిసి ఉప్పల్ భగాయత్‌లో వాకింగ్ చేస్తుంది. ఆమె భర్త కంటే ముందు నడుస్తూ కొద్ది దూరం వెళ్లే సరికి అక్కడే మాటు వేసిన గుర్తు తెలియని వ్యక్తి ఆమెను షార్ప్‌స్టిక్‌తో బెదిరించి పక్కనే ఉన్న పొదల్లోకి లాక్కెళ్లి మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కున్నాడు. చెవి కమ్మలు లాక్కునేందుకు యత్నించగా భయాందోళనకు గురైన ఆమె తానే స్వయంగా చెవి కమ్మలు తీసి ఇచ్చింది. అనంతరం ఆమె చేతిలో ఉన్న సెల్ ఫోన్ లాక్కుని పొదల్లోకి విసిరేసిన ఆగంతకుడు ఆమె గొంతు నులుముతూ ఎవరికైనా చెబితే చంపుతా, నీ ఫొటో కూడా తీసుకున్నానంటూ బెదిరిస్తూ అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపింది. ఆమె భర్త డయల్ 100 కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ పోలీసులు బాధితురాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

మనీశ్‌యాదవ్‌ను అభినందించిన స్పీకర్



మల్లాపూర్: నాచారం డివిజన్‌కు చెందిన సాహస యాత్రికుడు మనీష్ యాదవ్ కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించాడు. శుక్రవారం స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ మనీశ్ యాదవ్‌ను అభినందించారు. ప్రపంచంలోని అతిపెద్ద పర్వతాలను అధిరోహించాలనేది లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు.

పారిశ్రామికవాడలో స్థల వివాదం

ఐలా కమిషనర్ చొరవతో సద్దు మనిగిన వైనం

ఉప్పల్: ఉప్పల్ ఐలా పారిశ్రామికవాడలో ఓ స్థల వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. దీంతో ఐలా, ఉప్పల్ రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. 1954 నుంచి 77 వరకు ఉప్పల్ కాల్సా సర్వే నంబర్–1 లో షేక్ మహ్మద్ ఇస్మాయిల్ పేరిట దాదాపుగా 20 ఎకరాల స్థలం రికార్డు ప్రకారం ఉందని తన తండ్రి మృతి చెందిన తర్వాత స్థలం బదలాయింపు కోసం కార్యాలయాలు చుట్టూ తిరిగిన ఎలాంటి ఫలితం లేకుండాపోయిందని ఇస్మాయిల్ కుమారుడు షేక్ మహ్మద్ గౌస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీఐఐసీకి చెందని తన తండ్రి పేరిట ఉన్న భూమిని వివిధ కంపెనీలకు కేటాయించగా మిగిలిన 2.09 ఎకరాల స్థలం మిగిలిందని దానికి సంబంధించిన ఏడీ సర్వే తర్వాత అప్పటి ఉప్పల్ తహసీల్దార్ సర్వే నంబర్ 1/2 లో మిగిలిన భూమి 2.09 ఎకరాల స్థలం ఉందని పంచనామా చేసి చూపించారన్నారు. అయినా కూడా ఆ భూమిలో నుంచి స్టేడియం గేట్ నంబర్–8 రేణుకా ఎల్లమ్మ ఆలయం వెనుక భాగంలో ఉన్న 1000 గజాల తన స్థలాన్ని కూడా టీఎస్ఐఐసీ ప్రైవేట్ వ్యక్తులకు కేటాయించడంపై హైకోర్టుకు వెళ్లగా కోర్టు ఆర్డర్ ఉన్నా టీఎస్ఐఐసీ అధికారులు ప్రైవేట్ వ్యక్తులకు ఎలా కేటాయించిందని ప్రశ్నించారు. శుక్రవారం సదరు వ్యక్తులు వివాదాస్పద స్థలంలో కందంకం తీస్తున్నారని తెలుసుకుని వచ్చి అడ్డుకుని ఐలా, ఉప్పల్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఉప్పల్ ఐలా కమిషనర్ ప్రభాకర్ మాట్లాడుతూ.. 2014లోనే 1000 గజాల స్థలం టీఎస్ఐఐసీ అలాట్ చేసిందని సదరు స్థలం మరో ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన స్థలం అని ఫిర్యాదులు రావడంతో ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో, జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వే తర్వాత అసలు విషయం బయటపడుతుందని అప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టవద్దని ఇరువురికి నచ్చజెప్పడంతో గొడవ సద్దు మణిగింది. తీసిన కందకాన్ని రెవెన్యూ సిబ్బంది మూసి వేయించారు. కాగా మరో వర్గం వారు తాము టీఎస్ఐఐసీ వద్ద కొనుగోలు చేశామని ఇదే తమదేనని ప్రైవేట్ వ్యక్తుల స్థలం అయితే తనకు ఎలా కేటాయిస్తారని తెలిపారు. సర్వే చేస్తే గానీ అసలు విషయం బయట పడుతుందన్నారు.



స్థలం వద్ద ఇరువురికి సర్ది చెబుతున్న ఐలా కమిషనర్ ప్రభాకర్

చైన్‌స్నాచర్ల అరెస్టు

ఉప్పల్ : కల్యాణపురిలో గురువారం సాయంత్రం చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ఇద్దరు యువకులను ఎస్ఓటీ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 3 తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇళ్లల్లో పని చేసే దాసమ్మ (41) గృహోపకర వస్తువులు తీసుకువచ్చేందుకు టీచర్స్ కాలనీ నుంచి కల్యాణపురి కాలనీలోని తెలిసిన వారి ఇంటికి శుక్రవారం సాయంత్రం బయలు దేరింది. బాధితురాలిని వెంబడించిన గుర్తు తెలియని ఇద్దరు అగంతుకులు ఆమె ఇంటి గేట్ లోపలికి వెళ్లగానే దాడి చేసి మెడలోని 3 తులాల పుస్తెల తాడును లాక్కెళ్లారు. దీంతో బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో అప్రమత్తమైన మల్కాజిగిరి ఎస్ఓటీ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ టీం సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితులు మస్క ప్రోహిత్ (22), కాంద్రేగుల లక్ష్మణ్ గౌడ్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని వారి నుంచి బంగారంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.



మస్క ప్రోహిత్, లక్ష్మణ్ గౌడ్

వేలం నిలిపివేయాలని వినతి

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన హెచ్‌బీకాలనీలోని కమ్యూనిటీ హాల్ వేలం పాటను నిలిపేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్ ఐఏఎస్‌ను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీ అవసరాల కోసం వినియోగించాల్సి హాల్‌ను వేలం వేయాలని నిర్ణయించారని, ఈ క్రమంలో కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులకు కేవీయట్ పిటిషన్ వేసి నోటీసులు ఇచ్చారని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే మంత్రి పొంగులేటి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. నిరుపయోగంగా ఉన్న కమ్యూనిటీ హాల్‌ను జీహెచ్ఎంసీకి అప్పగిస్తే పూర్తిస్థాయిలో వినియోగంలోకి వస్తుందన్నారు. ఎండీ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, సంక్షేమసంఘాల ప్రతినిధులు వెంకటాచారి, శివరాం ప్రసాద్, గోవిందరెడ్డి, చంద్రమోహన్ ఉన్నారు.



హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ గౌతమ్‌తో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు